క్లుప్తంగా

పోలింగ్ కేంద్రం పరిశీలన

చర్ల: మండలంలోని మావోయిస్ట్ ప్రాంతమైన తిప్పాపురంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని గురువారం తహసీల్దార్ ఆర్.అనంత రామ కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ బి.భరణిబాబులు పరిశీలించారు. కేంద్రంలో ఎన్నికల సిబ్బందికి అవసరమయ్యే సౌకర్యాలపై ఆరా తీశారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం తదితర అంశాలపై అక్కడి పంచాయతీ అధికారులకు సూచనలు చేశారు.

తాటిని కలిసిన మెచ్చా

దమ్మపేట: మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లును, స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. తాటి కాంగ్రెస్‌కు రాజీనామా చేసి, బీఆర్‌ఎస్ పార్టీలో చేరనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే మెచ్చా తాటిని దమ్మపేటలోని ఆయన నివాసంలో కలిశారు. ఒకరినొకరు బావ అంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. బీఆర్‌ఎస్‌లోకి రావాలని ఎమ్మెల్యే ఆహ్వానించగా.. కార్యకర్తల, అభిమానుల అభిప్రాయం మేరకు వస్తానని తాటి తెలిపారు.

పైపులైన్ పునరుద్ధరణ బాధ్యత ఆర్‌అండ్‌బీదే..

అశ్వాపురం: మండల కేంద్రంలో డ్రెయినేజీ పనుల్లో ధ్వంసమైన మిషన్‌భగీరథ పైపులైన్ పునరుద్ధరణ ఆర్‌అండ్‌బీ వారి బాధ్యతేనని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న 'తాగునీరందక మూడు నెలలు'అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై ఆయన స్పందిస్తూ.. డ్రెయినేజీ పనుల్లో ధ్వంసమైన మిషన్‌భగీరథ పైపులైన్ పునరుద్ధరణకు అంచనాలు వేసి సర్పంచ్‌కు అందజేశామని.. సర్పంచ్ ఆ అంచనాలను ఆర్‌అండ్‌బీ అధికారులకు ఇచ్చారన్నారు. పైపులైన్ పునరుద్ధరిస్తే వెంటనే తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సీపీఎంను ఆదరించండి

భద్రాచలంఅర్బన్: తెలంగాణ అసెంబ్లీలో భద్రాచల సమస్యలపై గళం విప్పి ఏజెన్సీ సమస్యల పరిష్కారానికి కారం పుల్లయ్యను ఆశీర్వదించాలని, గెలిపించి అసెంబ్లీకి పంపించాలని మాజీ పార్లమెంట్ సభ్యుడు మీడియం బాబురావు కోరారు. గురువారం సీపీఎం అభ్యర్థి కారం పుల్లయ్య, పార్టీ రాష్ట్ర సభ్యుడు బండారు రవికుమార్, మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, ఎలమంచిలి రవి కుమార్ నేతృత్వంలో ఆ పార్టీ బృందం భద్రాచలం పట్టణంలోని ప్రముఖులు, వైద్యులు, వ్యాపారస్తులను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలగాని బ్రహ్మాచారి, భీమవరపు వెంకటరెడ్డి, ఎర్రం శెట్టి వెంకట రామారావు తదితరులు ఉన్నారు.

కంచె ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఏర్పాటు చేసిన కంచె

సాక్షి ఎఫెక్ట్..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద ఉన్న ఎస్ఆర్ మెడికల్స్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని ఈ నెల 3న 'ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్'అనే కథనం సాక్షిలో ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన విద్యుత్ శాఖ ఏడీఈ వేణు, ఏఈ రాజారావులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తీసేయించి, కంచెను ఏర్పాటు చేశారు.

అణగారిన వర్గాల రాజ్యసాధనే లక్ష్యం

దుమ్ముగూడెం: అణగారిన వర్గాల రాజ్యసాధనే ధర్మ సమాజ్ పార్టీ లక్ష్యం అని, పార్టీ భద్రాచలం నియోజకవర్గం అభ్యర్థి రవ్వ భద్రమ్మను గెలిపించాలని మండల కో-ఆర్డినేటర్లు జీలకర్ర చంటి, ఇరుగు క్రాంతిలు కోరారు. ఈ మేరకు గురువారం మండలంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో కార్యకర్తలు రవి, రామ్ కరణ్, కిరణ్, శ్రీకాంత్, ముని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

అశ్వాపురం: మండల కేంద్రంలోని కాలువబజార్‌లోని శ్రీ సాయినాథుని ఆలయంలో గురువారం ఆలయ ధర్మకర్త, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సత్యప్రకాష్, అరుణ దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, ఆర్‌ఎంపీ డాక్టర్ అర్జున్, మహిళలు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని జూనియర్ కళాశాల సెంటర్‌లోని సాయిబాబారి మందిరంలో ప్రతి గురువారం జరిగే అన్నదాన కార్యక్రమానికి పట్టణానికి చెందిన నాదెళ్ల శ్రీనివాసరావు తన తల్లిదండ్రులు నాదెళ్ల నాగేశ్వరరావు-అన్నపూర్ణ, సోదరుడు నాదెళ్ల నాగేశ్వరరావు జ్ఞాపకార్థం రూ.50 వేలు విరాళం ఆలయ కమిటీకి అందజేశారు.



మణుగూరురూరల్: నామినేషన్ దాఖలు చేస్తున్న రేగా కాంతారావు



భద్రాచలం: నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య



భద్రాచలం: రిటర్నింగ్ అధికారికి నామినేషన్ సమర్పిస్తున్న తెల్లం వెంకట్రావ్

హోరెత్తిన నామినేషన్ల జాతర

- ముహూర్త బలంతో కదిలిన పార్టీలు
- ఇండిపెండెంట్లూ ఇదే రోజు కోసం వేచిన వైనం
- ర్యాలీలు, నినాదాలతో మార్మోగిన నియోజకవర్గ కేంద్రాలు



గోండ్వాన దండకారుణ్య పార్టీ తరఫున వజ్జా జ్యోతిబసు..

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రభుత్వ విప్ రేగా కాంతారావు గురువారం మణుగూరు తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. తొలుత కరకగూడెం మండలం సమత్‌భట్టుపల్లి గ్రామపంచాయతీలోని కుర్నవల్లి స్వగ్రామంలో తన మాతృమూర్తి వద్ద రేగా కాంతారావు దంపతులు దీవెనలు తీసుకున్నారు. అనంతరం గ్రామంలోని ఆలయాల్లో, బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మణుగూరుకు చేరుకుని తహసీల్దార్ కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. రేగా నామినేషన్ ఫీజును వార్డ్ మెంబర్ వెంకటసోములు దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, లీగల్ అడ్వైజర్ పానుగోటి కిషన్ తదితరులు పాల్గొన్నారు. ఈయనతోపాటు బీజేపీ తరఫున పాడియం బాలరాజు, బీఎస్పీ తరఫున వజ్జా శ్యామ్, గోండ్వాన దండకారుణ్య పార్టీ తరఫున వజ్జా జ్యోతిబసులు, స్వతంత్ర అభ్యర్థులుగా బట్టా విజయ్‌గాంధీ, పూనెం రాజేష్‌లు తమ నామినేషన్ పత్రాలను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్‌కు అందజేశారు. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ నుండి పాయం వెంకటేశ్వర్లు మూడో సెట్‌ను, స్వతంత్ర అభ్యర్థిగా పాల్వంచ దుర్గ రెండో సెట్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

పొదెం వీరయ్య..

భద్రాచలం: భద్రాచలం కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య గురువారం నామినేషన్ వేసేందుకు ముందు సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్యకర్తలు, అభిమానులు, నాయకుల నడుమ ర్యాలీగా వచ్చి ఆర్‌డీవో కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను అందచేశారు. అనంతరం ఆయన స్వగృహంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఓటమి స్పష్టంగా కనపడుతోందని, ఆ భయంతోనే కాంగ్రెస్ నాయకులపై ఈడీ దాడులు జరిపిస్తోందని ఆరోపించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ మాట్లాడారు. కార్యక్రమాల్లో టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, టీడీపీ నాయకులు కుంచాల రాజారాం, పట్టణ అధ్యక్షులు సరెళ్ల నరేష్, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెల్లం వెంకట్రావ్..

భద్రాచలం నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావ్ గురువారం రెండో సెట్ నామినేషన్ వేశారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల కోలాహలం నడుమ ర్యాలీగా వచ్చి భద్రాచలం రిటర్నింగ్ కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి నామినేషన్‌ను దాఖలు చేశారు. అనంతరం కార్యాలయం బయట విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో తాను ఓడి పోలేదని, తననుగెలిపించుకోలేని భద్రాచలం ప్రజలే ఓటమి చెందారని అన్నారు. ఈ ఎన్నికలలోనైనా స్థానికుడైన తనను గెలించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మానె రామకృష్ణ, బోదెబోయిన బుచ్చయ్య, తాండ్ర వెంకట రమణ, గంటాడి కృష్ణ, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇతర పార్టీలు



నామినేషన్ అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు



పినపాక: బీఎస్పీ అభ్యర్థి వజ్జా శ్యామ్ నామినేషన్.

బహుజన సమాజ్ పార్టీ తరుపున రవి కుమార్, ధర్మ సమాజ్ పార్టీ తరుపున రవ్వా భద్రమ్మ, సీపీఎం తరుపున కారం పుల్లయ్య, కొర్సా చిలకమ్మ., విద్యార్థుల రాజకీయ పార్టీ తరుపున మిత్రా మడకం, ఇండిపెండెంట్‌లుగా ఉబ్బా సీతారాములు, నక్కా సాయిబాబులు గురువారం నామినేషన్ పత్రాలు అందజేశారు. కాగా శుక్రవారంతో నామినేషన్ల సమర్పణ ప్రక్రియ ముగియనుంది.

అశ్వారావుపేటలో 8 నామినేషన్లు..

అశ్వారావుపేట: అశ్వారావుపేట(ఎస్టీ) నియోజకవర్గానికి గురువారం 8 నామినేషన్లు దాఖలు అయినట్లు రిటర్నింగ్ అధికారి పర్సా రాంబాబు తెలిపారు. పిట్టల అర్జున్(సీపీఎం), మడకం ప్రసాద్ (బీఎస్పీ), అయిరం ప్రశాంత్ (ఇండిపెండెంట్), మెచ్చా నాగేశ్వరరావు(బీఆర్ఎస్), మూడ్ రవిచందర్ (ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ), ఊకే రవి (గోండ్వానా దండకారణ్య పార్టీ), సున్నం నాగమణి (ఇండిపెండెంట్), గొగ్గల ఆదినారాయణ (సీపీఎం) నామినేషన్లు దాఖలయినట్లు తెలిపారు.

పొత్తు ధర్మాన్ని విస్మరించొద్దు..

దుమ్ముగూడెం: పొత్తుధర్మాన్ని విస్మరిస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించేదే లేదని, గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం సీపీఐ పాత్ర కీలకమైందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రావులపల్లి రవికుమార్ కాంగ్రెస్‌ను ఉద్దేశించి అన్నారు. గురువారం మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో తాటిపుడి రమేష్ అధ్యక్షతన జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో పొత్తులో భాగంగా భద్రాచలం కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్యను గెలిపించేందుకు సీపీఐ అహర్నిశలు శ్రమించిందని, ఇప్పుడు కొత్తగూడెం అభ్యర్థి కూనంనేని సాంబశివరావు గెలుపు కోసం కాంగ్రెస్ నాయకులు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి నోముల రామిరెడ్డి, కిలిమి ఎల్లారెడ్డి, మండపాటి సుధాకర్ రెడ్డి, వర్సా గౌరయ్య, బొల్లోజు వేణు, కాకా వెంకటేశ్వరరావు, అమరవాది శంకర్, కుంజా లక్ష్మయ్య, కొర్సా కోటేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రావులపల్లి రవికుమార్


ఘనంగా ఏటీఏ ఆవిర్భావ దినోత్సవం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఆవిర్భావ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయబాబు ఏటీఏ జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 244(1) ప్రకారం 5వ షెడ్యూల్లో గిరిజనులకు సంబంధించి నిబంధనలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక షెడ్యూల్ ట్రైబల్స్‌కే కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాసం ఆదినారాయణ, సోయం కృష్ణ, కుంజా బక్కయ్య, తెల్లం శ్రీనివాస్, శేషయ్య, వసంతరావు, సారయ్య, బాబురావు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీనగరంలో జెండాను ఏటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయబాబు ఆవిష్కరించి అనంతరం మాట్లాడుతూ.. రాజ్యాంగంలో ఆదివాసీలకు కోసం పొందుపరిచిన నిబంధనలన్నిటినీ ప్రభుత్వాలు అమలు చేస్తే షెడ్యూల్ ట్రైబల్స్ అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు కుర్సం రవి, ఏటీఏ నాయకులు మచ్చ బాబురావు కారం శ్రీనివాసరావు, సవలం శ్రీనివాసు, చీమల నంగయ్య, పోలెబోయిన మధుబాబు, వినోద్ బాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చర్ల: చర్ల మండలంలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ 12వ వార్సికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. చర్లలోని విద్యావనరుల కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అసోసియేషన్ పతాకాన్ని టీఏ జిల్లా కార్యదర్శి కొర్సా చిట్టిబాబు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.వీరాస్వామి, జిట్టా నాయకులు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ రామారావు, టీ లక్ష్మీపతి, నాయకులు శేషు, మురళీ, ప్రసాద్, వెంకట్రావు, రాజబాబు, రాజ్‌కుమార్, శ్రీనివాస్, రామలక్ష్మి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

భారీగా ట్రాఫిక్ జామ్!



ఖమ్మం మార్గంలో నిలిచిన వాహనాలు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట నుంచి ఏపీకు వెళ్లే జాతీయ రహదారిలో గురువారం భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయానికి బీఆర్ఎస్, సీపీఎం పార్టీలతోపాటు పెద్ద సంఖ్యలో స్వతంత్ర అభ్యర్థులు తమ అనుచరులు, కార్యకర్తలతో నామినేషన్లు దాఖలు చేసేందుకు తరలి వచ్చారు. స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీతో తరలి వచ్చారు.

ఈ నేపథ్యంలో ఒక్కసారిగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. దాంతో ఇటు ఏపీ, అటు ఖమ్మం వైపు వెళ్లే లారీలు, కార్లు, బస్సుల తోపాటు ఇతర వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దాదాపు రెండు గంటలపాటు వాహనాల రాకపోకలు స్తంభించిపోగా.. వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. స్థానిక సీఐ కరుణాకర్, ఎస్సై పి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో రెండు గంటలపాటు శ్రమించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి

మణుగూరుటౌన్: వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిందని, ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో 15వేల ఓట్ల పైచిలుకు సొంత ఓటు బ్యాంకు కలిగిన తాము కూడా కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేస్తామని వైఎస్‌ఆర్‌టీపీ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బుర్రా సోమేశ్వరగౌడ్ అన్నారు. గురువారం మణుగూరులోని వైఎస్‌ఆర్‌టీపీ నియోజకవర్గ ముఖ్య మండల నాయకులతో సమావేశంలో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ పార్టీ తమను కూడా గుర్తించాలని కోరారు. సమావేశంలో నాయకులు పసునూరి ఉప్పల్ రెడ్డి, దుర్గాల వెంకటేశ్వర్లు, షేక్ అహ్మద్ హుస్సేన్, నెలపట్ల పూర్ణచంద్ర రెడ్డి, కుందూరు రామకృష్ణ, బూమిరెడ్డి వెంకటరెడ్డి, సత్యానారాయణ గౌడ్ ఉన్నారు.

మాదిగలకు అన్యాయం

అశ్వాపురం: అసెంబ్లీ సీట్ల కేటాయింపులో మాదిగలకు కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందని మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల నాగేశ్వరరావు అన్నారు. గురువారం అశ్వాపురంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీల ఉమ్మడి రిజర్వేషన్‌లను పంచాలని దశాబ్ద కాలంగా మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి నాయకత్వంలో ఉద్యమిస్తున్నామన్నారు. మాల నాయకుల మాటలకు వారు ఇచ్చే మూటలకు తలొగ్గిన కాంగ్రెస్ రాష్ట్ర, కేంద్ర నాయకత్వం మాదిగలకు మొండిచేయి చూపిందని విమర్శించారు.

విగ్రహావిష్కరణ

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీ నగరం గ్రామంలో దాసాంజనేయ దేవస్థానంలో జీరి సత్యనారాయణ గురుస్వామి ఆధ్వర్యంలో అర్చకులు రాజగోపాలచార్యులు కన్య స్వాములచేత గురువారం అయ్యప్ప స్వామి విగ్రహావిష్కరణ చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు అల్లాడి వెంకటేశ్వరరావు, వేముల శ్రీను, పూదోట శ్రీను, పంపన పవన్, కాకి భాస్కర్ రెడ్డి, పతివాడ జగదీష్, డింగి నాగేశ్వరరావు, శివ, వంశి, కన్నె స్వాములు చింటూ, కర్జాకర్ ఎల్లోజీ, భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలు తొలగించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం గిరిజన బీఈడీ కళాశాల ప్రహరి పక్కన ఉన్న దుకాణాలను తొలగించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్, అఖిల భారత మానవ హక్కుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని బీఈడీ కళాశాలను గురువారం సందర్శించిన వారిని ప్రహరి వెంట దుకాణాల నుంచి కళాశాలలో పడేసిన మద్యం సీలను వారు గుర్తించారు. అధికారులు స్పందించి ఆ దుకాణాలను తొలగించాలని, గోడపై రక్షణ కంచే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఓటు ప్రాధాన్యతపై అవగాహన

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని త్రివేణి జూనియర్ కళాశాలలో గురువారం ఎస్‌వీఈఈపీ అవగాహన కార్యక్రమాన్ని నోడల్ ఆఫీసర్ సమ్మయ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ.. 18 సంవత్సరాలు నిండిన పౌరులందరికీ భారత రాజ్యాంగం ఓటు హక్కును కల్పించిందని, అర్హులందరూ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని అన్నారు. ఎటువంటి ఒత్తిడిలకు ప్రభావితం కాకుండ ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని విద్యార్థులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: ఓటు వినియోగంపై గురువారం అవగాహన కల్పించారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో చంద్రుగొండ తహసీల్దార్ ఎస్‌కె.సాధియా బేగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాలలో ఇన్‌ఛార్జి డీన్ డాక్టర్ ఐవీ శ్రీనివాసరెడ్డి, ప్రొఫెసర్లు గోపాలకృష్ణమూర్తి, రాంప్రసాద్, ఆర్ రమేష్, రెడ్డిప్రియ, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.



భద్రాచలంఅర్బన్: విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొనసాగుతున్న చేరికలు

చర్లరూరల్: బీజేపీ జిల్లా కమిటీ సభ్యుడు, చర్ల మాజీ మండల అధ్యక్షుడు పాశికంటి సంతోష్, చర్ల పద్మశాలి సంఘం నాయకులు చింతలపూడి రమేష్‌లు గురువారం బీఆర్‌యస్‌లో చేరారు. చర్ల మండల బీఆర్‌యస్ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు సోయం రాజారావు, పోలిన లంకరాజుల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ, భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాతా మధు, భద్రాచలం అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు సమక్షంలో గులాబీ గూటికి చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోదండ రామయ్య, ప్రచార కార్యదర్శి కొటేరు శ్రీనివాసరెడ్డి, చర్ల సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, మహిళా అధ్యక్షురాలు పోలూరి సుజాత, కొసరాజు రాజా, సోయం కృష్ణవేణి, కాపుల నాగరాజు, ఆలం ఈశ్వర్, కాకి అనిల్, దొడ్డి తాతారావు, బోళ్ల వినోద్, పంజా రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పార్టీలో..

భద్రాచలంటౌన్: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పొదెం వీరయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ అధ్వర్యంలో గురువారం వెంకటాపురం, వాజేడు, చర్ల, దుమ్ముగూడెం మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వెంటకటాపురం మండలానికి చెందిన ఎంపీటీసీ రేగ భిక్షపతి, మాజీ సర్పంచ్ పూజారి సమ్మయ్య, చర్ల మండలానికి చెందిన డీసీఎమ్ఎస్ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ పరుచూరి రవికుమార్, మాజీ మండల కార్యదర్శి బండి వేణు, మాజీ వైస్ ఎంపీపీ బండి మణితో పాటు కాంగ్రెస్‌లో చేరిన వారికి ఆయన పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సరెళ్ళ నరేష్, రవికుమార్, దుర్గాప్రసాద్, శ్రీనివాస రెడ్డి, సతీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చర్ల: బీఆర్‌ఎస్‌కు చెందిన చర్ల పీఏసీఎస్ అధ్యక్షుడు పరుచూరి రవికుమార్, డైరెక్టర్ పందిళ్లపల్లి రాధాకృష్ణ, మండల పరిషత్ మాజీ వైస్ ఎంపీపీ బండి మణి, నాయకులు బండి వేణు, తోటమళ్ల వరప్రసాద్, గెదె సుధాకర్, రంగు నర్సింంహామూర్తి తదితరులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా వారికి ఎమ్మెల్యే పొదెం వీరయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ సూపరింటెండెంట్ రంజిత్‌కుమార్ చౌదరి

అన్నపురెడ్డిపల్లి: పోస్టల్ శాఖలోని వివిధ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రంజిత్ కుమార్ చౌదరి కోరారు. గురువారం మండల కేంద్రంలోని సబ్‌పోస్టుఆఫీస్ వద్ద నిర్వహించిన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొని.. పోస్టాఫీస్‌ల్లోని వివిధ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఆడపిల్లల కోసం సుకన్య సమృద్ధి, మహిళల కోసం మహిళా సమ్మాన్‌సేవింగ్ సర్టిఫికెట్, ఎస్‌బీ, ఆర్‌డీ, పీపీఎఫ్, ఎంఐఎస్ వంటి పథకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, రాజేందర్‌నాయక్, పోస్ట్ మాస్టర్లు, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పార్టీల ప్రచారం



కరకగూడెం: ఓటర్లకు కాంగ్రెస్ మేనిఫెస్టో అందజేస్తున్న నాయకులు

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో..

మణుగూరురూరల్: ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పని చేసే బీఆర్‌ఎస్ పార్టీని, పార్టీ పినపాక అసెంబ్లీ అభ్యర్థి రేగా కాంతారావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ఎడ్ల శ్రీనివాస్, రామిడి రామిరెడ్డిలు కోరారు. గురువారం మండలంలోని సమితిసింగారం, వాగుమల్లారం, కూనవరం తదితర గ్రామాల్లో గడప గడపకు ప్రచారం చేసి మాట్లాడారు. పార్టీ నాయకులు, బూత్ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

కరకగూడెం: పేదల అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్తోనే సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. మేనిఫెస్టో పత్రాలను అందజేసి కాంగ్రెస్ పార్టీ పినపాక అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. పలు పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఐటీ దాడులు రాజకీయ కుట్రే..

మణుగూరుటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై, పాలేరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై ఐటీ, ఈడీ దాడులు చేయిస్తున్నారని, రాజకీయ కుట్రను రానున్న ఎన్నికల్లో ప్రజలు తిప్పి కొడతారని కాంగ్రెస్ పినపాక నియోజకవర్గ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్య నాయకులతో కలిసి మాట్లాడారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కేవిరావు, పుచ్చకాయల శంకర్, వీరంకి వెంకట్రావ్ గౌడ్, గోరంట్ల కనకనయ్య, ముఖ్య నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, జీవరత్నం, గాండ్ల సురేష్, బాబు, పాతూరి వెంకన్న, శివ ఉన్నారు.

అశ్వాపురం: ఈడీ, ఐటీలను అడ్డుపెట్టుకొని పొంగులేటి విజయాలను ఆపలేరని డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు తుళ్లూరి బ్రహ్మయ్య గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ చేస్తున్న కుట్ర, కుతంత్రాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

బూర్గంపాడు: బీఆర్‌ఎస్, బీజేపీలు కుట్రపూరితంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇళ్లపై ఐటీ దాడులకు ప్రేరేపించాయని కాంగ్రెస్ నాయకులు మారం వెంకటేశ్వరరెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డిలు అన్నారు. సారపాకలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జీ ఓబుల్‌రెడ్డి, జీ రమణారెడ్డి,బాదం రమేష్‌రెడ్డి, రామనరసయ్య, లక్ష్మణ్‌నాయక్, జాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇళ్లపై ఐటీ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి, ఎంపీపీ ముత్తినేని సుజాత అన్నారు. మండల కేంద్రంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో జిల్లా, మండల కో ఆప్షన్ సభ్యులు షర్ఫియుద్దీన్, ఖదీర్, ఎంపీటీసీ రవి, కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి రమేష్, బొబ్బాల నాగేష్, పొడియం అనిల్, తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, ఐటీ దాడులను పొగులేటిపై కుట్రగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అభివర్ణించారు. ఈయన వెంట సర్పంచ్‌లు బట్టా సత్యనారాయణ, కాకా అశోక్ తదితర నాయకులున్నారు.



అశ్వాపురం: సమావేశంలో మాట్లాడుతున్న కేశవరెడ్డి, ఎంపీపీ సుజాత

రహదారిపై నిరసన..

అశ్వారావుపేటరూరల్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసం, వ్యాపార సంస్థల్లో ఐటీ దాడుల పట్ల అశ్వారావుపేట రింగ్ రోడ్ సెంటర్ తోపాటు, మండలంలోని గాండ్లగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు జూపల్లి ప్రమోద్, నండ్రు రమేష్, అల్లాడి రామారావు, అలీబాబు, బి.ప్రసాద్ పాల్గొన్నారు.